

# అన్వేషణ

— కె.జె. నాగరత్నం

ఇరువై ఏళ్ల వయసులో విశాఖ బీచ్‌లో రామకృష్ణామిషన్ దగ్గర కనుపించావు. ఇక మెరుపుతీగలా, ఒక అప్సరసలా, దివి నుండి భువికి దిగివచ్చిన ఒక విద్యుల్లతలా కనిపించి, మరు నిమిషంలో కారెక్కి మాయమయిపోయావు.

అప్పటి నుంచి ఒళ్లంతా కళ్లు చేసుకొని నీ పునర్దర్శనం కోసం బీచ్‌లో తిరుగుతూనే వున్నాను. కాని కంటికి మరలా కనుపించలేదు. నీ రూపం మాత్రం నా మనసులో ముద్రించుకొన్నాను. కనుపించని నీకు 'లత' అని పేరు పెట్టుకున్నాను. ఎందుకంటే నీవు విద్యుల్లతలా వుంటావు కదా మరి!

ఎక్కడున్నావు లతా! చదువుకొనే రోజుల్లో యూనివర్సిటీలో, సాయంత్రాలు బీచ్‌లో, సెలవులలో విశాఖ బజారులలో, ఉద్యోగంలో చేరాక ఆఫీసులో, బయట పనులమీద తిరిగేటప్పుడు రోడ్డుకు రెండు వైపులా, నీ కోసం వెతుకుతూనే వున్నాను. ఇన్ని సంవత్సరాలలో ఒక్క సారైనా కనుపించకుండా దాగుకొన్నావా లతా! నువ్వు కనుపించకపోయినా నీ పిలుపు నాగుండెల్లో వినిపిస్తూనే వుంది. నీ రూపం మనసులో స్థిరంగా నిలచివుండగా, నీ తలపులే ఊపిరిగా నా గుండెలు నిండి, ఉచ్ఛ్వాసనిశ్వాసలే నీ పేరుగా జపిస్తుంటే ఎన్నాళ్ల దాగుడుమూతలు ఆడుతావు లతా? నిన్ను ఏదో ఒకరోజు తప్పక కలుసుకుంటాను.

చదువు పూర్తయి ఉద్యోగినయాను కదా లతా! తరువాత నా కథ అందరి కథలాంటిదే. పెళ్లి నిశ్చయం చేశారు. కనీసం పెళ్లికయినా వస్తావా లతా!

ఇన్నాళ్లూ నీ ఆలోచనలతో పరాకుగా వుంటే నా స్నేహితులు ప్రేమలో పడ్డావేమిటిరా! అంత చిరాకుగా వుంటున్నావు అని వెక్కిరించారు లతా! నేను ఎవరినీ ప్రేమించలేదే! నిన్ను సైతం ఆరాధించానే కాని ప్రేమించి, కామించలేదే! నీ రూపం చూసి ముగ్ధుడనయ్యాను. నీ రూపానికి తగిన రూపవంతుడు, ధనవంతుడు, గుణవంతుడు నిన్నే పెళ్లాడి, నీ జీవితమంతా సుఖసంతోషాలతో నిండి పరిపూర్ణమవ్వాలని ఆశించానేకాని కాకిముక్కుకు దొండపండులా నా లాటి సామాన్యుడికి నువ్వు భార్యవవటం కలలో కూడా సహించలేనే! నేను నీ ప్రేమలో, విరహంలో పడ్డానని అనుకునేవాళ్లు ఎంత మూర్ఖులు?

పెళ్లి చేసుకొన్నాను లతా! నీవు రాకపోయినా ఆగలేదు. మొదటిరాత్రి నిన్ను గురించి నా భార్యకు చెప్పాను. అంతా విని మీరు లతను ప్రేమిస్తున్నారా అని అడిగింది. చిన్నగా నిట్టూర్చి మన ప్రేమ ఎటువంటిదో వివరించాను. అంతా విని చిన్నగా నవ్వుతూ "మీరు తప్పక లతను కలుసుకొంటారు. నా మాట నమ్మండి" అంది. నాకు చాలా సంతోషం కలిగింది.

కాలచక్రం పరిభ్రమిస్తుంటే రోజులూ, నెలలూ, సంవత్సరాలు గడిచిపోయాయి. నేను తండ్రి నయ్యాను లతా! ఆ మధురానుభూతిని నీతో పంచుకొని, నీ కళ్లలోని వెలుగు చూడాలనుకున్నాను. కాని అది తీరని కోరికగానే మిగిలిపోయింది లతా!

నా పుత్రరత్నం పెరుగుతున్నాడు లతా! అప్పుడే ఆరేళ్లు నిండాయి. నన్ను రోజూ బీచికి తీసుకు వెళ్ళే స్నేహితుడయ్యాడు. నేను బీచికి వెళ్లటం నువ్వు కనపడుతావేమోననే ఆశతోనే లతా! ఒక్కసారి కనుపించి నా మనసుకు నిండు చేయవా!

"నాన్నగారూ! సముద్రం ఒడ్డున ఇంకెంతసేపు కూర్చుంటారు? నాకు ఆకలేస్తోంది. ఇంటికి పోదాం. లేకపోతే అమ్మ కేకలేస్తుంది." చిన్నిగాడి అర్జీ.

వెళ్లిపోదాం చిన్నా! మరొక్క పావుగంట కూర్చుని వెళ్లిపోదాం! కాదు నాన్నగారూ! నాకు ఆకలేస్తోంది. ఇంటికి

పోదాం! చిన్నగా విట్టూర్పి లేచి ఒక్కసారి బీచంతా కళ్లకు కనపడినంత మేరా చూశాను. ఈ రోజు రోజూలాగే నీ దర్శనం కలుగలేదు. నిమ్మదిగా చిన్నితో ఇంటిదారిపట్టాను. వెనుక నుండి సముద్రం ఘోష వినిపిస్తోంది. కాని నిన్ను చూడాలని ఘోషించే నా మనసు ముందు అదెంత!

ఎంత కాలం కనపడకుండా దాక్కుంటావు లతా! ఒక్కొక్కసారి భయం వేస్తుంది. నిన్ను చూడకుండానే నన్ను భగవంతుడు పిలుస్తాడేమోనని, కానీ వెంటనే ధైర్యం వస్తుంది. నా కోరిక తీర్చకుండా వాడు రమ్మంటే మాత్రం నేవెడతానా లతా!

నీ అన్వేషణ కొనసాగుతూనే వుంది. నేను రోజూ బీచికి వెళ్లివస్తూనే వున్నాను. కాకపోతే ఇప్పుడు నాకు తోడుగా చిన్నిగాడికి బదులు వాడి కొడుకు వానిగాడు ఉన్నాడు. మరొక పక్క నా కూతురు లత కొడుకు బాబీ కూడా వున్నాడు. నీకు చెప్పలేదు కదా! నా కూతురికి నీ పేరే పెట్టుకొన్నాను. సెలవులకు బాబీని తీసుకొని పుట్టింటికి వస్తుంది. అప్పుడు నాకు తోడు ఇద్దరు మనమళ్లు. ఇద్దరు స్నేహితులు.

రోజులు, సంవత్సరాలు గడుస్తున్నాయి. నా కోరిక మాత్రం తీరటంలేదు. కాని నా నమ్మకం మాత్రం రోజు రోజుకీ ఎక్కువ అవుతున్నది. నేను ఖచ్చితంగా నిన్ను కలుసుకుంటాను. ఆ నమ్మకమే నాకు ఏనుగంత బలం ఇస్తోంది.

రోజులు గడుస్తున్నాయి. కానీ నా దినచర్య ఏమీ మారలేదు. ఉద్యోగం నుంచి రిటైరయ్యాను. కానీ నీ అన్వేషణ నుంచి మాత్రం రిటైరవలేదు.

బాబిగాడు ఇసుకతో పిచ్చిక గూళ్లు కడుతున్నాడు. నేను కాళ్ల దగ్గర దాకా వచ్చి అందినట్లు అంది వెనక్కు పోయే కెరటాలను చూస్తున్నాను. అవి చిందించే పాలనురుగు నీ చిరునవ్వులేననిపిస్తోంది. నిన్ను మొదటిసారి చూసింది ఇక్కడే. మళ్లీ ఇక్కడే కనపడతావని ఆశ.. లతా! నువ్వెంత నిర్దయురాలివి! ఒక్కసారి కనిపించి నాజీవితం ధన్యం చేయవా!

- ఇంటికి పోదాం తాతయ్యా! హోంవర్కు చేసుకోవాలి. లేకపోతే ఆ మోహన్‌గాడు ఫస్ట్ రాంకు కొట్టేస్తాడు. లే తాతయ్యా! బాబిగాడి చిలక పలుకులు.

నిమ్మదిగా లేచి బాబిగాడితో ఇంటి ముఖం పట్టాను.

"వచ్చారా? ఇందాకనగా వంట అయిపోయింది. కాళ్లు కడుక్కు రండి. వడ్డిస్తాను". నెమ్మదిగా బాత్‌రూంలోకి వెళ్లి కాళ్లు కడుక్కొని భోజనం అయిందని పించాను. చేతులు తుడుచుకుంటూ టీవీ ఎదుట సోఫాలో కూలబడ్డాను న్యూస్ విందామని. ఏమిటో ఈ మధ్య కళ్లకు టీవీ బొమ్మలు మసక మసకగా కనపడుతున్నాయి.

"నాన్నగారూ! మీకు చత్వారంతోపాటు షార్ట్ సైటు కూడా వచ్చిందని నాకు అనుమానంగా వుంది. కళ్లు చిట్లించి టీవీ చూస్తున్నారు. రేపు ఉదయం కళ్ల డాక్టరు దగ్గరకు వెడదాం!" చూశావా లతా! చిన్నిగాడికి నేనంటే ఎంత ప్రేమో!

మర్నాడు చిన్నితో డాక్టరు దగ్గరకు వెళ్లాను. పరీక్షలు పూర్తయాక ప్రిస్క్రిప్షను రాసిచ్చాడు. నన్ను ఇంటి దగ్గర దిగబెట్టి చిన్ని ఆఫీసుకు వెళ్లిపోయాడు.

నాన్నగారూ! ఇదుగో కొత్త కళ్లజోడు. పాతది ఇంక వాడకండి అంటూ నా చేతికి అందించాడు. నా మనస్సు సంతోషంతో నిండిపోయింది. ఇన్నాళ్లూ ఈ మసక చూపుతో నువ్వు కనపడినా గుర్తు పట్టలేనేమోనని భయపడేవాడిని. చిన్నిగాడి ధర్మమా అని ఆ దిగులు తీరిపోయింది.

ఆ రోజు కొత్త కళ్లజోడు పెట్టుకొని బీచికి వెళ్లాను. నాకు తోడుగా బాబిగాడు వచ్చాడు. ఎప్పటిలాగే ఈ రోజు కూడా నిరాశతో ఇల్లు చేరాను.

నాన్నగారూ! మీరు రోజు రోజుకీ చిక్కిపోతున్నారు. ఏం షుగరు మాత్రలు, బి.పి. మాత్రలతోపాటు బికాంప్లెక్సు కూడా వేసుకుంటున్నారా! జనరల్ టానిక్, ప్రోబయాటిక్ మాత్రలు వేసుకుంటున్నారా! పిచ్చివాడు లతా! నా ఆరోగ్యం విషయంలో నేను ఎంత శ్రద్ధ తీసుకుంటున్నానో వాడికేం తెలుసు? నేను ఆరోగ్యంగా వుంటేనే గదా ఏనాటికైనా నిన్ను చూడగలిగేది! అయినా నీ వెంత నిర్దయురాలివి లతా! ఇన్నాళ్ల, కాదుకాదు, ఇన్నేళ్ల నా నిరీక్షణలో, అన్వేషణలో ఒక్కసారయినా నాకు కనపడాలని నీకనిపించలేదా! ఒకటి మాత్రం నిజం లతా! నేను పోయేల్లోగా నిన్ను కలుసుకొని తీరుతాను. ఏ శక్తి దీనిని ఆపలేదు!

రోజులు నెలలు గడుస్తున్నాయి. భగవంతుడు చేతికి మూడో కాలు ఇచ్చాడు. అయినా నీ కోసం బీచికి వెళ్ళటం మానలేదు. స్వచ్ఛమైన పాలనురుగును సృష్టిస్తూ అందీ అందకుండా ఎగసిపడే కెరటాలలో నాకు నీ అందమూ, నీ రూపమూ కనిపిస్తాయి.


ఏమండీ! అమ్మాయి దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది. ఇల్లు కట్టటం దాదాపు పూర్తి అయిందిట. అయినా ఇంకో యాభైవేలు వుంటేగాని పని పూర్తయి గృహప్రవేశం చెయ్యటం కష్టమట. అన్నగా ఏమైనా సర్దగలమేమో కనుక్కోమన్నాడట అల్లుడుగారు.

అయితే ఏం చేద్దాం!

పెళ్లయి పాతికేళ్లయి, ఇద్దరు పిల్లలు పుట్టినా వాళ్ల చదువులకు గాని, మరే అవసరానికిగాని అల్లుడు మనను ఒక్క రూపాయి అడగలేదు. అయినా అప్పగా ఎందుకు? నా నగల్లో సగం అమ్మాయివేగా! బంగారానికి ధర బావుందట. అమ్మితే కనీసం మూడు లక్షలు వస్తాయి. సగం డబ్బు దానికి, సగం డబ్బు కోడలికి ఇద్దాం. సరే అలాగే చెయ్యి. చిన్నిగాడితో చెప్పి వాడితో ఆ పని చేయించు.

నాన్నగారూ! అమ్మ నగలు అమ్మితే మూడు లక్షల నలభై వేలు వచ్చాయి. లయా డభ్భై వేలు బావగారిపేర డి.డి. పంపాను. మిగతా డబ్బు, నా దగ్గర డబ్బు కలిపిన నీన్యూ అపార్ట్‌మెంట్సులో త్రీ బెడ్‌రూం అపార్టుమెంట్ బుక్ చేశాను. ఇంకొక రెండు లక్షలు కావాలి. నా ఎల్.ఐ.సి. పాలసీ మీద లక్ష రూపాయల లోను వస్తుంది. మీరు మీ పి.ఎఫ్. లోంచి ఒక లక్ష ఇస్తే వెంటనే అపార్టుమెంటు స్వాధీనం చేసుకోవచ్చు. అది మీ పేర రిజిష్టరు చేయిద్దామనుకొంటున్నాను. చిన్నగా నవ్వాను. చిన్నా! ఇవ్వాళో రేపో అంటున్న నాపేరిట ఎందుకురా! అది బాబిగాడి పేరు మీద రిజిష్టరు చేయించు. ఈ ఇల్లు నీ పేరు మీద విల్లు రాశాను. అంటూ లక్ష రూపాయలకు చెక్కు రాసి వాడికిచ్చాను.

లతా! బాధ్యతలు తీరిపోతున్నాయి. కష్టందుకు పిల్లలకు ఒక మంచి దారి చూపించాను. ఆర్థికంగా వారికి బాధలు లేకుండా చేశాను. ఇప్పడిక నా పేరు మీద బాంకులో వున్న డభ్భైవేలు, గాజువాకలోని అయిదు వందల గజాల స్థలం, నా పెన్షను, నాకూ, నా భార్యకూ మిగులుతాయి. లతా!






## సహృదయావేదన

నెయ్యపు పాలు త్రాగి
నల్లగా ఉమ్మేస్తావు
ముత్యాల నవ్వుని నా కళ్ళలో మెరిపిస్తావు
నా గుండెలోంచి బొట్లు బొట్లుగా రక్తం కారుతుంది
వెలుగులా మురిపిస్తావు
కాలరాత్రి నన్నావరించుకుంటుంది
ఓ నటసార్వభౌమా!
కొండల, లోయల భేదత్వాలాలకు
లయ తప్పని అడుగులేయడమెలా నేర్పావురా?
నీడనిచ్చిన
చెట్టును నరికితే
గూడు కూలిన గువ్వలా
పుట్టెడు శోకమే మిగులుతుందిరా !
చినుకు లేనిదే
లేవు విత్తుకు ప్రాణ స్పందనలు
తరువు చల్లని ప్రేమ స్పర్శ వేనిదే
లేవు మబ్బుకు పులకింతలు
నా మనసు గాలి పటాన్ని
జడిగాలివై ఎన్నిసార్లు చీరలేదు,
నా హృదయపాటల ప్రవాహాన్ని
మెరుపు తీగెల సాళ్ళెగుళ్ళ అల్లి
నన్నే కబళించ చూస్తావా?
ఓ నా ప్రియ మిత్రమా!
ఈ పాల మనసు పైకి
నాగు పాములా బుసలు కొట్టడం నేర్పావు గదరా
కన్నీటిని తుడిచినవాడు..
అచ్చమైన మనిషిరా
నీ గాయాలపై
మలాం రాసిన చేతిని
మరిచినంత వరకూ
ఈ ప్రపంచమే ఘనీభవిస్తున్న శిలరా!

– బి.వెంకటయ్య

## ప్రేమ దీపం

ప్రశాంతంగా వున్న నా హృదయంలో
ప్రవేశించి నన్ను కలవరపెడుతున్నావు
ఆలోచనలే లేని నాకు నీ ఊహలతో
నీ తలపులతో జీవించేలా చేశావు
నా హృదయంలో ప్రేమ దీపాన్ని వెలిగించావు
నీ కళ్లలో వెలిగే అద్భుతమైన ఆ వెలుగు
రేఖలు నా హృదయపు పొరలలో
సూటిగా తాకుతుంది.
ఆ ఆకర్షణీయమైన నీ మోము నిర్మలమైన
నా మనస్సుని నీ వైపే తిప్పింది
ఏది ఏమైనా గాని మిత్రమా
నీ ప్రేమవుంటే చాలు జీవించినంతకాలం.

– కె.ఎమ్.కావేరి
కర్నాటక.

నిన్ను కలుసుకునేటప్పటికి నాకుండే ఆస్తి ఇంతే. అలా జరుగకూడదుకాని దురదృష్టవశాత్తు నిన్ను కలుసుకునేటప్పటికి, నీకేమైనా ఆర్థిక బాధలుంటే ఈ ఆస్తి చాలు నిన్ను ఆదుకోవటానికి. ఇంకా కావాలన్నా నా కొడుకూ, కూతురూ నాకు సంతోషంగా నేనడిగింది ఇస్తాను. ఇంక నాకు నిశ్చింత.

రోజులూ, నెలలూ, సంవత్సరాలు గడుస్తున్నాయి. మూడు కాళ్లతో కష్టమే అయినా బీచికి వెళ్లి, ఎప్పుడూ కూర్చునే చోటే కూర్చుని, నీ కోసం కళ్లు కాయలు కాచేలా చూస్తునే వున్నాను. అయినా నువ్వు ఇంకా దోబూచులాడుతున్నావు లతా!

నాన్నగారూ! మీరు సముద్రంగాలి పడదని డాక్టరుగారు చెప్పారు. అపార్టుమెంటులో మీ బెడ్‌రూం బాల్కనీలో కూర్చుంటే సముద్రం కనిపిస్తుంది. అయినా మీరు బీచికి వచ్చి గంటల తరబడి కూర్చుంటే ఆరోగ్యం పాడవుతుంది.

నవ్వుకున్నాను. నేను సముద్రం చూడడానికి బీచికి వస్తున్నానా! నేను నిన్ను చూసినపుడు ఎక్కడ కూర్చున్నానో అక్కడే కూర్చుని నీ కోసం ఎదురు చూడటంలో ఉన్న ఆనందం వాడికెలా తెలుస్తుంది లతా! పైగా బీచిలో వున్నంతసేపే నా మనసు, శరీరం నీ తీపి గుర్తులతో ఆరోగ్యంగా వుంటాయని వాడికేం తెలుసు?

సాయంత్రం బయలుదేరి బీచికి వచ్చి కూర్చున్నాను. నీ నవ్వులా సముద్రం అందమైన పాలనురుగులు చిందిస్తూ చిరునవ్వులు చిందిస్తోంది. మనసంతా నీమీదే లతా! ఈ వృద్ధుడిని ఇంకా ఎన్నాళ్లు ఎదురుచూపులు చూడమంటావు? ఒక్కసారి ఉలిక్కిపడ్డాను. నీవు కూడా వృద్ధురాలవైనావా లతా! కాదుకాదు. నా స్మృతిలోని నీ రూపమే నీకు ఈ రోజు కూడా వుంటుంది. ఒక వేళ ముదిమి మీద పడినా నీ మనోహరమైన ముఖం నేను తప్పక గుర్తుపట్టగలను.

నా ఆలోచనలను భంగపరుస్తూ కారు ఆగిన చప్పుడు వినపడింది. చిరాకుగా అటువైపు చూశాను. చిన్నిగాడు పరుగు పరుగున వస్తున్నాడు. నా మనసెందుకో కీడు శంకిస్తోంది లతా!

నాన్నగారూ! అమ్మకి వున్నట్టుండి గుండెపోటు వచ్చింది. మూర్తిగారి హాస్పిటల్‌లో ఇంటెన్సివ్ కేర్‌లో వుంచి మీ కోసం వచ్చాను. త్వరగా పదండి. వెంటనే లేచి నిల్చున్నాను. ఒక్క నిముషం కళ్లు తిరిగాయి. తూలిపడబోయాను. చటుక్కున రెండు చేతులతో చిన్ని పట్టుకున్నాడు. బయర్లు కమ్ముతున్న కళ్లతో చిన్ని వంక చూశాను. చెంపలు కన్నీటితో తడిసి వున్నాయి. వివరాలడిగి వాడిని ఇంకా బాధపెట్టటం ఇష్టంలేక కారెక్కి కూర్చున్నాను. మరుక్షణం కారు కదిలింది. కళ్లు మూసుకొని దేవుడిని ప్రార్థించాను లతా! నన్ను అన్యాయం చెయ్యవద్దని.

క్షణాల్లో కారు మూర్తిగారి నర్సింగ్ హోం ముందు ఆగింది. దిగి గబగబా నడిచాను. అది నడక కాదు లతా! పరుగు. లోపలికి వెళ్లగానే "తాతయ్యా! ఇటురా! బామ్మ ఈ గదిలో వుంది" బాచిగాడి పిలుపు వినపడింది. అటువేపు గుమ్మం దాకా నడచి ఒక్క నిముషం ఆగాను. ధైర్యం కూడగట్టుకొని లోపలికి అడుగుపెట్టాను.

ఒక చేతికి సెలైన్, ముక్కుకు ఆక్సిజను గొట్టాం, ఒళ్లంతా తగిలించిన వైర్లు పక్కనే వున్న ఇ.సి.జి. మెషీన్‌కు తగిలించి వున్నాయి. నదిటి మీద గీతలలాగా ఇ.సి.జి. డిస్ప్లే స్క్రీన్ మీద అర్థంకాని గీతలు కదిలిపోతున్నాయి. పెథిడిన్ ఇచ్చి వుంటారు. ప్రశాంతంగా పడుకుని వుంది. మసకలు కమ్మిన కళ్లు డాక్టర్ మూర్తిగారివేపు తిరిగాయి. "మొదటిసారే అయినా స్ట్రోక్ చాలా మాసివ్‌గా వచ్చింది. పరిస్థితి ఏమీ బాగాలేదు. మా ప్రయత్నం మేము చేస్తున్నాం. తరువాత భగవంతుడి దయ!" నావేపు చూస్తూ మూర్తిగారు అన్నారు. ముప్పయ్యేళ్ల అనుబంధం. ఈనాటితో తీరిపోతోందా! పాలిపోయిన ముఖంతో నా భార్య ముఖం చూసి ఉలిక్కిపడ్డాను. ఇదేమిటి? నా భార్య అచ్చం లతలా వుంది! ఉండటమేమిటి! లతే! అంటే నా భార్యే లతా! ఇంతకాలం నా కళ్లు గుడ్డివైనాయా! లేక నా మనసే గుడ్డిదయిందా! ఆపుకోలేని ఉద్వేగం, దుఃఖం ముంచుకురాగా నా భార్య చెవి దగ్గరగా నోరుపెట్టి లతా! అని పిలిచాను. ఆ పిలుపు కోసమే వేచివున్నట్లు వెంటనే కళ్లు తెరచింది. చెయ్యి పైకెత్తి నా ముఖాన్ని నిమురుతూ చిన్నగా నవ్వింది. మరుక్షణం ఆ చెయ్యి కిందకు జారిపోయింది. తల ప్రక్కకు వాలిపోయింది. మూర్తిగారు ముందుకు వచ్చి ముక్కులోంచి ఆక్సిజను గొట్టం బయటకు తీశారు. సెలైన్ సూది బయటకు లాగేసి ఐయాంసారీ! బి బోల్డ్. అని నా భుజం తట్టారు.

నాకు అర్థం అయింది. నా భార్య, నా లత ఇకలేదు. నా అన్వేషణ పూర్తి కాగానే నిర్దయగా లత వెళ్లిపోయింది. ఇన్నేళ్లగా అన్వేషణ విషాదంగా ముగిసింది. గుండె పిండినట్లయి ఒళ్లు ఒక్కసారి తూలింది.

జారిపోతున్న తండ్రిని రెండు చేతులతో గట్టిగా పట్టుకున్నాడు చిన్ని. మూర్తిగారు చప్పున ముందుకు వచ్చి అందుకొని పక్కనే వున్న బెడ్ మీదకు చేర్చి నాడి చూశారు. పాలిపోయిన ముఖంతో స్టెత్‌తో గుండె పరీక్షించి తల ఎదిల్చి చిన్నివేపు చూశారు. సారీ! హి ఈజ్ నో మోర్. భార్య పోయిన షాక్‌ని అబ్సార్బ్ చేసుకోలేకపోయారు. "ఐయాం సారి మై బోయ్! బట్ యూఆర్ లక్కీటు హేవ్ నచ్ వండర్‌ఫుల్ ఫాదర్ అండ్ మదర్. యుఆర్ ఇన్‌సపరబుల్ ఈవెన్ ఎట్ ది యండ్ ఆఫ్ లైఫ్."

●

